# మూలం:జీవననాదం

**నాగభూషణాచార్యులు, ఎస్.వి.ఎస్.**

ఆ రోజు మామూలుగానే తెల్లవారింది వరదరాజులుకి. అలారం ఇంకా మోగక ముందే నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, టీ పెట్టుకుని, సగంతను తాగి, మిగిలింది భార్యకుంచి, వాకింగ్‌కి వెళ్లి వచ్చాడు. వచ్చేసరికి గుమ్మం పక్కనే పడేసి వున్న హిందూ పేపర్ తీసుకుని, తన గదిలోకి నడిచి పేపర్ పఠనంలో నిమగ్నమయ్యాడు. మధ్యలో భార్య ఇచ్చిన మిల్కు తాగి, బెండింగ్ ఎక్సర్సైజులు చేసి మళ్లీ W.T.O. మీద ఈ మధ్యనే వచ్చిన ఓ ఇంగ్లీషు పుస్తకం చదవసాగాడు. ఇంతలో గోడనున్న గడియారం చూసేసరికి తొమ్మిదయింది. గబగబా హాల్లోకి వచ్చి లేటైనందుకు భార్య ఏమన్నా మంత్రాలు చదువుతుందేమోనని అక్కడ ఆగకుండా మంచినీళ్లు తెచ్చుకుని సుగర్ టాబ్లెట్ వేసుకున్నాడు. భార్య ఆయన వంక రెప్ప వాల్చకుండా అలాగే చూసింది గానీ ఏం మాట్లాడలేదు. బతుకు జీవుడా అనుకుంటూ అక్కడి నుండి స్నానాల గదిలోకి వెళ్లి స్నానం చేసి వచ్చి, టిఫిన్ ప్లేటు అందుకునేసరికి, భార్య స్నానం, పూజ కూడా కానిచ్చి, రెండు ముద్దలు గబగబా తిని స్కూలుకి వెళ్లిపోయింది. ఇక వరదరాజులు తాపీగా కూర్చుని, అంతకు క్రితం రోజు మొదలుపెట్టిన కథను పూర్తి చెయ్యడంలో నిమగ్నుడయ్యాడు. పావు తక్కువ పన్నెండవుతుండగా అక్కణ్నుంచి లేచి, భోజనం కానిచ్చి, టిఫిన్ సర్దుకుందామని చూసేసరికి గిన్నెలో టిఫిన్ లేదు. 'ఏమిటి, ఈ రోజు ఈమెకు మూడ్ సరిగా ఉన్నట్లు లేదు. కాలేజీ కాంటీన్ నుంచి తెప్పించుకుందాంలే' అనుకుంటూ కాలేజీకి బయలుదేరాడు.

కాలేజీలో అడుగు పెట్టినా, అక్కడా అన్నీ విచిత్రంగా అనిపించాయి వరదరాజులుకి. స్టాఫ్‌లో ఎవరికి వారు అంతా పనిగట్టుకి వచ్చి మరీ ఆయనకు విష్ చేస్తున్నారు. కాలేజీలో ఆయనే సీనియర్ మోస్ట్ అయినా, ఏ ఒకరిద్దరో ఆయన్ని విష్ చేసేవారు. మిగిలినవారు ఎదురుపడినా తప్పించుకుని వెళ్లేవారు. ప్రిన్స్‌పాల్ గదిలో కూడా అలాంటి అనుభవమే ఎదురయిందాయనకి. ఆయన గదిలోకి ఎంటర్ కావడంతోనే, ప్రిన్స్‌పాల్ తనే లేచి నిలబడి ఆయనకు షేక్ హాండిచ్చాడు.

స్టాఫ్ రూమ్‌కి వెళ్లి టెక్స్ట్ బుక్స్ తీసుకుని థర్డ్ బెల్ అవుతుండగానే, అలవాటు ప్రకారం క్లాస్ రూంలోకి అడుగుపెట్టాడాయన. స్టూడెంట్సంతా నిలబడి ఒక్కసారిగా కాలేజీ అంతా వినబడేట్లు గుడ్‌మార్నింగ్ చెప్పారు. గట్టిగా అరిచిన ఆ అరుపును ఆయన గమనించీ, గమనించనట్లు తనూ గుడ్‌మార్నింగ్ చెప్పి, పుస్తకం తీసి లెసన్ మొదలెట్టబోయాడాయన.

"సార్... ఈ రోజు కూడా లెసనేనా సార్?" అందరూ కోరస్‌గా అరిచారు.

"ఏం... 'ఈ రోజు కూడా' అంటే?" అర్థంగానట్లు అడిగాడు వరదరాజులు.

"ఇదే మీ ఆఖరి పీరియడ్ కదా సార్... ఏమైనా మంచి విషయాలు చెప్పండి సార్" మళ్లీ విద్యార్థులంతా కోరస్‌గా అరిచారు.

అవును కదూ... ఒక్కసారిగా గుర్తొచ్చింది వరదరాజులు మాష్టారుకి. ఈ రోజు తన రిటైర్మెంట్ డే. మామూలు రిటైర్మెంట్ కాదు తనది. తను కోరుకున్న రిటైర్మెంట్ ఇది. అంటే... వలంటరీ రిటైర్మెంట్! మర్చేపోయాడు. ఇదే తన ఆఖరి క్లాసనేసరికి ఏదో చెప్పరాని వెలితి అనిపించిందాయనకు. చాలా మందిలాగా రిటైర్మెంట్ తర్వాత ఏం చెయ్యాలన్న సమస్య లేదాయనకి. కాలక్షేపానికి కొదవ లేదు. అడపాదడపా రాస్తుంటాడు. రాసేదాని కన్నా ఎక్కువ చదువుతూంటాడు. ఇంటి దగ్గరే కూర్చుంటే ఈ పని ఎన్నో రెట్లు ఎక్కువగా చేయవచ్చు. అసలందుకే ఈ వలంటరీ రిటైర్మెంటన్న సంగతి భార్యకి తప్ప ఎవరికీ చెప్పలేదు. ఆరోగ్యం సరిగా లేదని కొందరికీ, పాఠాలు చెప్పీ చెప్పీ విసుగొస్తోందని కొందరికీ చెప్పాడు. కానీ ఒక్కసారిగా ఇన్ని వందలమంది విద్యార్థులతో గల సంబంధాన్ని కోల్పోవడమే పెద్ద బాధగా ఉందాయనకు. ఆ బాధను దిగమింగుకుంటూనే వాళ్లడిగిన సందేహాలకు తనకు తోచిన సమాధానాలు చెప్పాడు.

సాయంకాలం నాలుగ్గంటలకు సభ జరిగింది. ప్రిన్స్‌పాల్‌గారు సభకు అధ్యక్షత వహిస్తూ, వరదరాజులు మాష్టార్లో అన్నీ సుగుణాలే వున్నాయని చెప్పాడు. మిగిలిన లెక్చరర్లు కూడా ఆయన జీవితమే ఆదర్శమన్నట్లు అంతా ఒప్పుల కుప్పే అన్నట్లు పొగడి పొగడి. పొగడ్తలంటే చెవి కోసుకునే వారిక్కూడా వెగటు పుట్టించేట్లు మాట్లాడారు. అన్ని సభల్లోనూ ఏ విషయాన్నయినా విమర్శనాత్మకంగా విశ్లేషించి చెప్పే వరదరాజులు ఈ రోజు యోగిపుంగవుడిలా సాటి లెక్చరర్ల పులిసిన పొగడ్తలు చెవుల తుప్పు వదలగొడుతూంటే మౌనంగా విన్నాడు.

లెక్చరర్ల ఉపన్యాసాల తర్వాత, ఓ విద్యార్థి తనంతటతను లేచి, మాట్లాడడానికి వచ్చాడు. అతను నాగరాజు. క్లాసులో వాడంత మొద్దబ్బాయి, అల్లరివాడు లేడు. తన చేత తిట్లు తినని రోజు ఉండదు. కోపం పట్టలేక దెబ్బలూ తరచు వడ్డిస్తూనే ఉంటాడు. వీడేం మాట్లాడతాడా అని చూశాడు వరదరాజులు.

"మాష్టారికి నమస్కారం. ఆయన రిటైరవుతోంటే మాకెంతో బాధగా ఉంది. ఆయన చేత తిట్లూ, దెబ్బలూ తినడం నాకలవాటే. నాకే కాదు, అల్లరి చేసేవారికి, పాఠం చదవనివారికి ఇది రోజూ వున్న సంగతే. అయితే ఏం? మా అమ్మానాన్నలు మమ్మల్ని తిట్టడం లేదా? మాట వినకపోతే కొట్టడం లేదా? ఆయనా అంతే! ఒక రోజు ఎర్రగా తేలిన వాతల్ని చూసి ఓ మాష్టారు ప్రిన్స్‌పాల్ గారికి కంప్లైంట్ చెయ్యమని చెప్పారు. ఆయన పేరు చెప్పడం నాకిష్టం లేదు. ఆయన మా మేలు కోరి చెప్పడం లేదని మాకు తెలుసు. వరదరాజులు మాష్టారు గారు ఏ నాడూ పాఠాన్ని పాఠంగా చెప్పలేదు. కథ చెప్పినట్లు చెప్పారు. ఆ కథలే మా జీవితాంతం గుర్తుండిపోతాయి" అన్నాడు నాగరాజు. వాడు బాధను పట్టలేక కన్నీళ్లు పెట్టుకున్నాడు. విద్యార్థులందరి పరిస్థితి అలాగే ఉంది. ఇద్దరు-ముగ్గురు విద్యార్థులయితే తమ ఉపన్యాసాల్ని మధ్యలో ఆపేసి వెళ్లి కూర్చున్నారు.

వాళ్ల మాటలకి నిశ్చేష్టుడయ్యాడు వరదరాజులు. వారి ఆప్యాయత అతని గుండెల్ని కెలికి వేసినట్లనిపించింది. ఇంతటి అభిమానానికి తను తగునా? అని తనని తనే ప్రశ్నించుకున్నాడు.

చివరగా వరదరాజులు మాష్టార్ని మాట్లాడమన్నారు ప్రిన్స్‌పాల్.

వరదరాజులు లేచి వెళ్లి మైకు ముందు నిలబడ్డాడు. విద్యార్థులందరి వంక ఒక్కసారి తేరిపారా చూశాడు. అందరి మొహాలలోనూ దిగులు కొట్టొచ్చినట్లు కనబడింది. ఒక్కసారిగా ఉద్విగ్నతకు లోనయ్యాడు వరదరాజులు. రెండు నిమిషాలు అలాగే మాట్లాడకుండా నిలబడి తమాయించుకున్నాడు. తన మీద ఇంత ఆదరణ చూపిన అందరికీ మొదట కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు. తర్వాత ఇలా అన్నాడు. "విద్యార్థుల్ని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల కర్తవ్యమని పెద్దలు చెబుతారు. మేం ఎంత వరకు అలా తీర్చిదిద్దుతున్నామో మాకే అర్థం కాని పరిస్థితికి ఈ

రిజల్ట్ ప్రధానమైన విద్యావిధానం వల్ల ఏర్పడింది. అది అట్లా ఉంచితే, నేను పాఠాల్ని కథలుగా చెబుతానని ఓ విద్యార్థి అన్నాడు. ఏమో వాడికలా అన్పించిందేమో. ఏమైనా నేను కథకుణ్ని కదా! నా కథలు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. ఇప్పటి దాకా ఏమో గాని, మీకు విసుగు లేకపోతే చిట్టచివరగా మీకో కథ చెబుతాను. వింటారా...?" ప్రేక్షకుల అభిప్రాయం కోసం చుట్టూ చూశాడు వరదరాజులు.

కథలంటే ఆసక్తి వుండందెవరికి? పిల్లలేకాదు, లెక్చరర్లతో పాటు ఆఖరికి ప్రిన్స్‌పాల్ గారు కూడా "చెప్పండి ... చెప్పండి.."... అంటూ ఆసక్తిగా అరిచారు.

"చెబుతాను. ఈ కథ ఉత్తమపురుషలో నడుస్తుంది..." చెప్పసాగాడాయన.

** ** **

"మొహం పుల్ల నోట్లో పెట్టుకుని అలవాటుగా పని చావడికేసి నడిచాను. అప్పుడే ఎప్పుడు కాలకృత్యాలు తీర్చుకుని పొలం వెళ్లి వచ్చాడోనాన్న, చిత్రిక గుల్ల తీసుకుని ఏదో కమ్మీని చిత్రిక పడుతున్నాడు. పక్కనే ఉలి, బాడిశ తెల్లగా నూరి పెట్టి ఉన్నాయి. పనివాళ్లు ఇంకా రాలేదు. ఎనిమిది దాటితేగాని వాళ్లు రారు. అయినా వాళ్లొచ్చే దాకా ఆగడం నాన్న కేనాడూ లేదు. ఎవరూ సాయంలేకపోయినా, ఒక్కడే పని చేసుకుంటాడు.



వంచిన తల ఎత్తకుండా పని చేసుకుంటూనే "ఏరా, లేచావా?" పలకరించాడు నాన్న. నాన్న పలకరింతకు తలూపాను. పొట్టి గుల్లతో పట్టుబడుతూ ముందుకు తోస్తూంటే, ఆ ఊపుకి చిత్రిక పొట్టు ఎగిరొచ్చి నా కాళ్ల మీద పడుతోంది.

"పని కుర్రాడొచ్చే వరకూ ఆగితే బాగుండేదేమో నాన్నా! పట్టాల్సిన మించు చాలా వుందనుకుంటా. ఒక్కడివే చిత్రిక పట్టడం కష్టం కదా!" అన్నాను. నాన్న వంగిపోయిన నడుం చూస్తోంటే నా మనసు కెలికినట్లయింది. అరవయ్యేళ్లు దాటిన నాన్న నడుముని సంసారభారం ఎప్పుడో వంచింది.

"ఆc, ఇది రోజూ వుండే పనే కదరా!" తేలిగ్గా అన్నాడు నాన్న.

నేనేమీ బదులివ్వకుండా గబగబా మొహం పుల్ల చీల్చి నాలుక గీసుకుని, అక్క డే వున్న తొట్లోని నీళ్లతో పుక్కిలించి వూసి, బల్ల దగ్గరకు నడిచాను. "అందాకా కాసేపు లాగనా నాన్నా?" అన్నాను సందేహిస్తూనే.

"చేతగాని పనిలో చెయ్యి పెడితే నా పనికే అడ్డమవుతావు గానీ, అట్లా ఎడంగా కూర్చో!" నాన్న తన పని చేసుకుంటూనే అన్నాడు.

ఆ మాటా నిజమే. మాటవరస కన్నాను గానీ, అయిదు నిమిషాలు గుల్ల లాగితే చేతులు అరగంట దాకా స్వాధీనంలోకి రావు. కొంచెం ఎడంగా పడి వున్న మండిగం కమ్మీ మీద కూర్చుని నాన్న వంకే చూస్తూండిపోయాను.

అప్పుడే నాన్న శరీరం ముడతలు పడింది. వెంట్రుకలన్నీ ఎప్పుడో నెరిసిపోయాయి. వాటిలో చాలా వరకూ వూడిపోయాయి కూడా. చిన్నప్పట్నుంచీ దిట్టంగా పని చేసినవాడు గనుక అలవాటు చొప్పున ఇప్పటికీ చేస్తున్నాడు కానీ, అదే ఉద్యోగస్తులయితే ఈ సరికే ఎప్పుడో రిటైరయ్యేవారు. తను ఇంత కష్టపడి పని చేస్తున్నా, మా అన్నదమ్ములెవ్వరినీ పనిఛాయలకు రానివ్వలేదు. అసలా మాటే ఎత్తనిచ్చేవాడు కాదు. ఇతరులెవ్వరయినా గుర్తు చేసినప్పుడయినా, తనకు చిన్నతనంలో చదువుకునే అదృష్టం కలగలేదనీ, తండ్రి సోమరితనం వల్ల చిన్నప్పుడే తనకు సంసారభారం నెత్తిన పడిందనీ, అందుచేత తన కొడుకులకా దురవస్థ పట్టకుండా అందరినీ చదువుల్లో పెట్టాననీ చెప్పేవాడు. మా అన్నలు మధ్య మధ్య డింకీలు కొట్టినా పట్టుబట్టి చదివించాడు తప్ప, పని మాట ఎత్తనిచ్చాడు కాదు. అన్నలిద్దరూ ఎలాగో చదువులు పూర్తి చేసి మెల్లగా ఉద్యోగాలు సంపాదించి ఎవరి సంసారాలు వారికేర్పడ్డా, ఆయనకు మాత్రం కనుచూపు మేరలో విశ్రాంతి లేదు. పాతికేళ్లు వచ్చినా ఇంకా నేను నాన్న సంపాదనమీదే ఆధారపడాల్సి వచ్చింది.

"ఏమిట్రా ఇంకా ఇక్కడే వున్నావ్... ఇంకా లైబ్రరీ టైం కాలేదా?" నాన్న ప్రశ్న నా ఆలోచనాతరంగాలకు అంతరాయం కలిగించింది.

"ఇంకా ఏడు కూడా కాలేదు కదా నాన్నా?" అన్నాను.

"ఒరేయ్! ఈ మధ్య నీ వైఖరి గమనిస్తున్నాను. ఏవేవో ఆలోచనలతో గడుపుతున్నావ్. ఉద్యోగం ఈ రోజు కాకపోతే రేపొస్తుంది. అనవసరమైన దిగులు పెట్టుకోకు!"

"అబ్బే, అదేం లేదు నాన్నా!" నేలను తవ్వుతున్న మేకును పక్కనే పడేశాను. నాన్న ఓదార్పు మాటలు నా అశాంతిని మరింత పెంచాయి.

ఇంతలో గ్లాస్కో పంచె కట్టుకుని, బిళ్ల కండువా వేసుకున్న ప్రెసిడెంటు చౌదరయ్య వచ్చాడు. "ఏవండీ బెమ్మంగోరూ! ఆ లెక్కన తెల్లారిందగ్గర్నుంచీ చీకటేల దాకా కష్టపడి వొంచిన నడుం ఎత్తకుండా పని చేస్తావు గందా.. ఏం చేస్తున్నావయ్యా సంపాయించిందంతా?"

నాన్న సమాధానం చెప్పలేదు. చిరునవ్వుతో "రా బాబాయ్, అలా దుంగ మీద కూర్చో" అన్నాడు, చౌదరయ్య అలా నిలబడే వుండటం గమనించి.

చౌదరయ్య కూర్చోలేదు. "సర్లేవయ్యా! చెట్టంత కొడుకుని కూచోబెట్టుకుని సొమ్ము లు పాతరేస్తున్నావా ఏంది? పదేలు పారేస్తే రేపీ పాటికి ఉజ్జోగం సంపాయించి నాలుగు రాళ్లు తెచ్చుకోడూ?" పదివేలంటే పదిపైసలన్నట్లు తేలిగ్గా మాట్లాడాడు చౌదరయ్య.

"బాబాయ్... నీకు తెలియందేముంది చెప్పు? రెక్కలు ముక్కలు చేసుకున్నా ఈ సంసారం ఈదటానికే సరిపోవడం లేదు. నా దగ్గర డబ్బు నిలవ కూడానా?" నాన్నగొంతుకలో ఎప్పుడూ లేని వణుకు కనిపించింది.

"అయినా నాకు తెలియకడుగుతాను కాస్త జెప్పు... పెతోడూ ఉజ్జోగం ఉజ్జోగమంటే గవుర్మెంటో డెక్కడని ఛస్తాడయ్యా? చదువు చదువో అంటూ నీ కొడుకుల్ని చంక నెక్కించుకున్నావ్! ఆళ్లని కూడా పనిలో సాయంగా పెట్టుకుంటే నీకీ తిప్పలన్నీ తప్పేవయా? ఆళ్లక్కడ కలకటేరో, గవుర్నోరో అయిపోతారని కలలుగన్నావ్! అయి నా నాకెందుకులే.. చేసుకున్నోడికి చేసుకున్నంత!" తన కొడుక్కి చదువబ్బక జులాయి తిరుగుళ్లు తిరుగుతూంటే, ఓ పేద వడ్రంగి కొడుకులు చదువుతున్నారే అన్న అక్కసు వెలిగక్కడం కనిపిస్తూనే ఉంది.

(మిగతా వచ్చే వారం)